ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 24.0
బుధవారం 20 ఆగస్టు 2025



23న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

- అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలి

వీసీలో కలెక్టర్ వినోద్‌కుమార్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 23వ తేదీన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీ సెక్టార్ తదితర అంశాలపై డ్వామా పీడీ, జడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓలు, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు తదితరులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... ఆగస్టుకి థీమ్ కింద ఈనెల 23న వర్షాకాలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు నివారించడం, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా మురుగునీటి కాలువలను శుభ్రపరచడం, నీటి నిల్వల నివారణ, వెక్టార్ నియంత్రణ చర్యలు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన పర్యవేక్షణ, నివేదికను పీఆర్ వన్‌యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఐజీటీ కర్మయోగి కార్యక్రమం కింద ప్రతి ఉద్యోగి కొన్ని శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పెండింగ్ ఉన్న అందరూ శిక్షణ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య గార్బేజ్ తొలగింపు, ట్యాంకులు శుభ్రం చేయడం, క్లోరినేషన్ 100శాతం చేపట్టేలా డీఎల్డీఓలు తనిఖీలు నిర్వహించాలన్నారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్, చైల్డ్ ఈకేవైసీ పెండింగ్ వెంటనే పూర్తి చేయాలన్నారు. 612 పెండింగ్ ఉన్నాయనీ, వాటిని 24 గంటల్లో పూర్తి చేయాలన్నారు. వీసీలో డీపీఓ నాగరాజనాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్ పాల్గొన్నారు.

ఆవిష్కరణల కార్ఖానా..!

జేఎన్‌టీయూలో రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్
స్టార్టప్‌లకు ప్రోత్సాహం.. యువతకు మెరుగైన శిక్షణ
నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు నాయుడు



రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్/వైద్యం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'ఆవిష్కరణల ఆలోచన మీదైతే పెట్టుబడి మాది. మిమ్మల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. స్వర్ణాంధ్ర-2047 కలను సాకారం చేసుకుందాం' అని యువతకు రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిస్తోంది. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేసే దిశగా 'రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్'ను నగరంలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసింది. సీఎం చంద్రబాబు వర్చువల్‌గా బుధవారం ఈ సెంటర్‌ను (మిగతా 6వ పేజీలో...)

మట్టి దోపిడీ..!

జిల్లాలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

- ప్రతి మండలంలోనూ సాగుతున్న తంతు
- కొండలు, గుట్టలను మాయం చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న గనుల శాఖ అధికారులు



గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలో తవ్వేసిన కొండ ప్రాంతం

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. మట్టి మాఫియా.. కొండలు, గుట్టలను సైతం తవ్వేసి, మైదానాలుగా మార్చేస్తోంది. గత రెండు, మూడు దశాబ్దాల కాలంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. మట్టి దందా మాత్రం ఆగలేదు. ప్రభుత్వానికి చెల్లించేది గోరంతైతే... తవ్వేది మాత్రం కొండలనే. గనుల శాఖ పరిధిలో ఉన్న తవ్వకాల అనుమతులను వైసీపీ హయాంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో మట్టి దోపిడీ మరింత అధికమైంది. జిల్లాలో తక్కువ ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు అనుమతులిచ్చారు. అనధికారికంగా చాలా ప్రాంతాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా గనుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

జిల్లాలో అనుమతుల్లేకపోయినా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వేస్తున్నారు. గుట్టలు, కొండలను సైతం కరిగించేస్తున్నారు. పెద్దపెద్ద కొండలైతే ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి తొలగిస్తున్నారు. మట్టిని వెంచర్లు, భూములు, ఇళ్లు, రోడ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ.8వేల నుంచి రూ.10వేలు సొమ్ము చేసుకుంటున్నారు.

32.55 హెక్టార్లకే అనుమతులు...

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతులున్నాయి. బుక్కరాయసముద్రం పరిధిలో 3, రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి వద్ద 2, తాటిచర్ల వద్ద 3, చియ్యేడు వద్ద రెండు వేర్వేరు ప్రాంతాల్లో 5.66, డీ.హీరేహాళ్ మండలం పులకుర్తి వద్ద 5.65, గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి వద్ద 1.8, కూడేరు మండలం కమ్మూరు వద్ద 3.24, పామిడి సమీపాన 3.3 హెక్టార్లలో, అనంతపురం రూరల్ మండలం కొడిమి వద్ద 4.9 ఎకరాల్లో మట్టి తవ్వకాలకు గనుల శాఖ (మిగతా 6వ పేజీలో...)

లోడు ఎత్తేస్తున్నారు...!

- పక్క రాష్ట్రాలకు పేదల బియ్యం
- సన్న బియ్యంగా మార్చి తరలింపు
- ప్రతినెలా వందల టన్నులు ఎగుమతి
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు



మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యం

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొందరు డీలర్లు అక్రమార్కులతో కుమ్మక్కై బియ్యం దందాకు తెరతీశారు. సాధారణంగా రేషన్ షాపుల్లో ఒకటో తేదీ నుంచి 15 వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా చాలా వాటిల్లో రెండు మూడురోజులకే ముగించేస్తున్నారు. బియ్యం తీసుకోనివారికి కిలోకు రూ.13 నుంచి రూ.18లోపు చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతినెలా టన్నుల చౌకధరల డిపో బియ్యం పక్కదారి పడుతున్నాయి. వారం రోజుల కిందట సజ్జలదిన్నె గ్రామం వద్ద విజిలెన్స్ అధికారులు దాదాపు 300 బస్తాలతో వెళుతున్న లారీని సీజ్ చేశారు. గన్నెవారిపల్లికాలనీ సమీపంలో ఒక ఇంటిలో 150బస్తాలను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. యాడికిలో దాదాపు 300టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశారు. ప్రతి మండలంలోను పేదల బియ్యం పక్కదారి పడుతున్నా సంబంధిత అధికారులు నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



లోడు చేసి సిద్ధంగా ఉన్న రెండు లారీలు

అక్రమార్కులకు అడ్డాగా...

రేషన్ బియ్యం అక్రమార్కులకు తాడిపత్రి ప్రాంతం అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వచ్చి సీజ్ చేస్తే తప్ప.. ఇక్కడ జరుగుతున్న అక్రమాలు స్థానిక అధికారులకు తెలియవా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానిక అధికారులు నెలవారి మామూళ్లకు మరగడంతోనే అక్రమార్కులు తాడిపత్రి ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుని తమ పనిని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాడిపత్రి టౌన్, రూరల్ యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, యల్లనూరు, పుట్లూరు మండలాలతోపాటు గుత్తి పామిడి ప్రాంతాల్లో కూడా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. యాడికిలోని రాయలచెరువులో 40రోజుల కిందట ఒక అరటి తోటలో డంప్ చేసిన బియ్యాన్ని సీజ్ చేశారు. చెరకు తోటలో రహదారి పక్కనే డంప్ చేసిన బియ్యాన్ని కూడా సీజ్ చేశారు. ఇన్ని జరుగుతున్నా అధికారులు మాత్రం తమ ఉదాశీన వైఖరిని వీడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చౌకగా కొని..

వ్యాపారులు రేషన్ డిపోల నుంచి తక్కువ ధరకు బియ్యం కొంటారు. వాటిని మిల్లుకు తరలించి సన్నబియ్యంగా మారుస్తారు. వాటిని తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు తరలించి, అక్కడ కిలో రూ.45 నుంచి రూ.55లకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఇలా ప్రతి నెలా వందల టన్నుల పేదల బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అధికారులు మాత్రం నామమాత్రపు దాడులతో మమా అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పేదల బియ్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



తనిఖీచేస్తున్న అధికారులు

స్త్రీ శక్తితో ఆర్టీసీకి నష్టం లేదు

- ఎండీ ద్వారకా తిరుమలరావు



రాయదుర్గంలో రూట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎండీ

రాయదుర్గం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం నుంచి ఆర్టీసీకి ఆర్థికంగా ఎలాంటి నష్టం ఉండదనీ, నిర్వహణ భారం మాత్రమే ఉంటుందని ఎండీ ద్వారకాతిరుమలరావు తెలిపారు. మంగళవారం ఆయనతోపాటు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు రాయదుర్గం డిపోను సందర్శించారు. డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడి బస్టాండ్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న ఆర్టీసీ బస్టాండు భవనాన్ని పునఃనిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎండీ మాట్లాడుతూ.. బస్సుల్లో ఆక్యుపెన్సీ ప్రస్తుతం 93 శాతానికి చేరుకుందన్నారు. అంతరాష్ట్ర సర్వీసుల్లో సరిహద్దు స్టేజ్ వరకు ఉచిత ప్రయాణాన్ని కల్పించే విషయంపై పరిశీలిస్తున్నామన్నారు. త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కడప ఈడీ చంద్రశేఖర్, ఆర్ఎం శ్రీలక్ష్మి, డిపో మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సరిహద్దు స్టేజ్ వరకు అమలు చేయండి

- ఆర్టీసీ ఎండీకి ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి

అంతరాష్ట్ర బస్సు సర్వీసుల్లో రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గానికి వచ్చిన ఆయనను ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం ఎమ్మెల్యే కలిసి వివిధ అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు ఉచిత ప్రయాణం అమలు చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోందని వివరించారు. వెనుకబడ్డ నియోజకవర్గంలో రాయదుర్గం నుంచి కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు చాలా దగ్గరలో ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాలకు అనేక పల్లెవెలుగు బస్సులు అంతర్రాష్ట్ర సర్వీసులుగా నడుస్తున్నాయన్నారు. స్త్రీ శక్తి పథకం అంతర్రాష్ట్ర సర్వీసులకు వర్తించకపోవడం వల్ల మహిళలు ఉచితంగా ప్రయాణించలేకపోతున్నారని వివరించారు. రాయదుర్గం నుంచి బళ్లారికి వెళ్లే పల్లెవెలుగు బస్సులు ఆంధ్ర సరిహద్దు వరకు దాదాపు 48 కి.మీ. ప్రయాణం చేస్తాయనీ, 11 కి.మీ. మాత్రమే కర్ణాటకలో నడుస్తాయన్నారు. ఇలాంటి ప్రాంతాలలో నడిచే పల్లెవెలుగు అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయడం వల్ల మహిళలకు ప్రయోజనం చేకూరకుతుందని తెలిపారు. దీనిపై ద్వారకా తిరుమలరావు సానుకూలంగా స్పందించారు. ఇదివరకే ముఖ్యమంత్రితో ఈ అంశంపై చర్చించామన్నారు. రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు అమలు చేయడం వల్ల ఆర్టీసీపై ఏ మేరకు అదనపు భారం పడుతుందో సమగ్ర వివరాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని ఎండీ తెలియజేశారు.



ఆర్టీసీ ఎండీతో కాలవ

టీచర్ల నియామకాలకు కొత్త విధానం

6

డీఎస్సీ టాపర్లు, కటాఫ్, మెరిట్‌లిస్టుకు చెక్

నేరుగా అర్హత అభ్యర్థులకు మెసేజీలు.. రాష్ట్రశాఖ ఆదేశాలు.. ఏర్పాట్లపై విద్యాశాఖ కసరత్తు

41 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం/రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా తరలుతున్న 41 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. అనంతపురం రూరల్ మండ లం పాములాయి సమీపంలో బలిజ రామకృష్ణకు చెందిన రేకుల షెడ్డులో అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 34 క్వింటాళ్ల బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం వ్యాపారి మాధవి, సహాయకుడు షేక్ షామీర్, ఆటో యజమాని రామయ్యపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుక్కరాయసముద్రం మండ లం రోటరీపురం క్రాస్ వద్ద అధికారులు వాహన తనిఖీలు చేస్తుండగా ఏడు క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. బియ్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి, ఆటో, బియ్యం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం వ్యాపారి తరుణ్ తేజ్, ఆటోడ్రైవర్ చాకలి నాగేంద్ర, సహాయకుడు వేణుగోపాల్‌పై కేసు నమోదు చేశారు. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్ పేర్కొన్నారు.

విడపనకల్లు వెళ్లాలంటే.. టిక్కెట్ కొనాల్సిందే..!

స్త్రీ శక్తికి దూరంగా మండలం

ఒక్క ఉచిత బస్సు సర్వీసూ నడపని ఆర్టీసీ

మహిళలపై భారం

7

జల తరంగం

భూమి అడుగు నుంచి
ఓ జల తరంగం
పై పైకి ఎగసి పడుతోంది.
గాలి అలలకు నాగినిలా
నాట్యం చేస్తూ...
మట్టిని తనలో ఇముడ్చుకుని
ఎరుపు వర్ణంతో అంబరం
చుంబించాలని ఎగబడుతోంది.
వృథా అవుతున్న నీరు..
ఇలా అందం పంచుతోంది..!

ఇది మండలంలోని పాపంపల్లి వద్ద మంగళవారం కనిపించిన దృశ్యం. అక్కడ శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ పగలిపోవడంతో నీరు ఇలా పైకి ఎగజిమ్ముతోంది. పైప్‌లైన్ పగిలిపోవడంతో ఐదు గ్రామాలకు తాగునీరు సరఫరా కాలేదు. గంటలకొద్దీ నీరంతా వృథాగా పోయిన తర్వాత కార్మికులు మరమ్మతులు చేశారు.

- ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం



'నక్ష'ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- సీడీఎంఏ సంపత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): నక్ష సర్వేపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సీడీఎంఏ సంపత్ కుమార్ హెచ్చరించారు. స్థానిక అనంత నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నక్షా కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ఉన్న ఆస్తులను డిజిటలైజేషన్‌లో భాగంగా అనంత నగరపాలక సంస్థ పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైందన్నారు. ఆస్తుల రీసర్వేపై ప్రత్యేకదృష్టి సారించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

డ్రోన్ కెమెరాతో జియో ట్యాగ్ చేసి, ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ)ల ఆధారంగా ఇంటింటా సర్వే చేయాలని సూచించారు. టౌన్‌ప్లానింగ్‌లో అధిక ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందని...త్వరగా పరిష్కరించి నివేదిక పంపాలని ఇన్‌చార్జి ఏసీపీ శిరీషాకు ఆదేశించారు. అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి నక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, నక్ష ప్రోగ్రాం ఇన్‌చార్జి ప్రవీణ్, ఏఎంసీ టీపీఓ శిరీష, టీపీఎస్ మంజుల, సచివాలయ ఉద్యోగులు వీఆర్‌ఓలు, అడ్మిన్‌లు, ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ఉద్యోగాలకు నేటి నుంచి పరీక్షలు

6

చైతన్య దీపిక


- సర్పంచ్ సామాజిక అవగాహన కార్యక్రమాలు
- పాఠశాలలు, హాస్టళ్ల సందర్శన

వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాకు జాతీయ స్థాయి పురస్కారం

6

డోలమైట్ అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడులు

- క్రషర్ల వద్ద అధికారుల తనిఖీలు



డోలమైట్ ఖనిజం నిల్వలను కొలతలు వేస్తున్న అధికారులు

6

నాడు-నేడు.. డొల్ల చూడు..!

నాసిరకంగా పనులు

- శింగనమల హైస్కూల్‌లో ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- రూ.లక్షలు వృథా





పెచ్చులూడిన తరగతి గదుల పైకప్పులు

వైసీపీ హయాంలో పాఠశాలల రూపురేఖలు మారుస్తామంటూ పాలకులు గొప్పలు చెప్పారు. నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయలు వెచ్చించి, పనులు చేపట్టారు. నాసిరకంగా పనులు చేసి, నిధులు దోపిడీ చేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలే ఇందుకు నిదర్శనం. పాఠశాలలో కోట్ల రూపాయలు వెచ్చించి, భవనాల మరమ్మతులు చేపట్టారు. రెండేళ్లు తిరక్కుండానే అవి దెబ్బతింటున్నాయి. పాఠశాలలో వైసీపీ పాలనలో నాడు-నేడు కింద భవనాల మరమ్మతులు ఇతర పనుల కోసం రూ.1.98 కోట్ల నిధులు మంజూరు చూశారు. భవనాల పైకప్పులకు ఫ్లోరింగ్, గోడలకు ప్లాస్టింగ్ పనులకు రూ.40 లక్షల మేర బిల్లులు చెల్లించినట్లు సమాచారం. పనులు నాసిరకంగా చేయడంతో రెండేళ్లు తిరక్కుండానే పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. పాఠశాలలోని 8 భవనాల్లో పెచ్చులు ఊడిపడుతుండడంతో ప్రస్తుతం అక్కడ తరగతులు నిర్వహించట్లేదు. ఇతర భవనాల్లో పాఠాలు చెబుతున్నారు. పనులు నాసిరకంగా చేపట్టడమే ఇందుకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, శింగనమల



పాఠశాల ఆవరణలో ఊడిన పెచ్చులను పడేసిన దృశ్యం

డోలమైట్ అక్రమ రవాణాపై

విజిలెన్స్ దాడులు

- క్రషర్ల వద్ద అధికారుల తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

యాడికి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పర్మిట్ల ముసుగులో భారీ దోపిడీ చేస్తున్న శ్రీనివాస మినరల్స్ కార్యాలయం, క్రషర్లపై మంగళవారం కర్నూలు రీజినల్ విజిలెన్స్ అధికారులు, తాడిపత్రి గనులు, భూగర్భ వనరుల శాఖాధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ రీజినల్ ఏడీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతపురం, నంద్యాల జిల్లాల సరిహద్దులో ఉన్న యాడికి మండలం దైవాలమడుగు గ్రామ సమీపాన శ్రీనివాస మినరల్స్ కార్యాలయంలో అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. క్రషర్ల వద్ద నిల్వ ఉంచిన డోలమైట్ ఖనిజాన్ని కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద తనిఖీల్లో అక్రమ పర్మిట్లు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. మూడు లారీల్లో పర్మిట్ల కన్నా అధిక టన్నేజీతో డోలమైట్ ఖనిజాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మూడు లారీలను సీజ్ చేసి, ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఆ లారీల డ్రైవర్లు ఇచ్చిన పర్మిట్ల ఆధారంగా శ్రీనివాస మినరల్స్ నుంచి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. పర్మిట్లలో 10 టన్నులలోపు అనుమతి ఉంటే లారీల్లో 30 టన్నులకుపైగా ఖనిజాన్ని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. డోలమైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రెండ్రోజులుగా శ్రీనివాస మినరల్స్‌లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలో ఖనిజ అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. క్రషర్ల వద్ద పెద్దఎత్తున డోలమైట్ ఖనిజాన్ని నిలువ ఉంచారనీ, ఎంతమేరకు అన్నది కొలతలు వేస్తున్నట్లు తెలిపారు. ఖనిజం ఎంత నిలువ ఉంది, అక్రమ రవాణా ఎంత మేరకు చేశారన్న వాటిపై లెక్క తేల్చడానికి నాలుగైదు రోజుల పడుతుందన్నారు. దీనిపై నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు శ్రీనివాస మినరల్స్‌పై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. తనిఖీల్లో కర్నూలు అసిస్టెంట్ జియాలజీ ఆఫీసర్ రాజగోపాల్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, తాడిపత్రి రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కవిత, సర్వేయర్ ఉమాదేవి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సర్పంచ్ మోనాలిసా (ఫైల్)

- సర్పంచ్ సామాజిక అవగాహన కార్యక్రమాలు
- పాఠశాలలు, హాస్టళ్ల సందర్శన
- బాల్యవివాహాల నష్టాలు, చదువు ఉపయోగాలపై పిల్లలకు అవగాహన
- పిల్లలతోనే పల్లె ప్రగతి అని గట్టి నమ్మకం
- వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాకు జాతీయ స్థాయి పురస్కారం

సామాజిక కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తుంటా



బాల్యవివాహాల నష్టాలు, చదువు ఉపయోగాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటా. పాఠశాలలకు వెళ్లినపుడు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటా. వాటి పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తా. విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని పిల్లలకు తెలియజేస్తా. జాతీయస్థాయిలో పురస్కారం దక్కడం ఆనందంగా ఉంది.

-మోనాలిసా, సర్పంచ్, వజ్రకరూరు

చైతన్య దీపిక..

ఉన్నత విద్య అభ్యసించడంలో..
ఉపాధ్యాయురాలి వృత్తిలో..
ఎన్నెన్నో సమస్యలు దృష్టికొచ్చాయి..
వాటికి పరిష్కారాల దిశగా ఆలోచించారు..
ఊరికి సర్పంచ్ అయ్యారు..
సమాజంలో మార్పునకు ప్రయత్నాలు మొదలెట్టారు..
అవగాహన ఒక్కటే మార్గమని నమ్మారు..
ప్రజల్లో చైతన్యంతోనే పరిష్కారం సాధ్యమనుకున్నారు..
ఓవైపు అభివృద్ధికి చర్యలు చేపడుతూనే..
మరోవైపు అవగాహన కార్యక్రమాలు మొదలెట్టారు..
బడులు, హాస్టళ్లు తిరుగుతూ..
బాల్య వివాహాల అనర్థాలు,
చదువు ఉపయోగాలు వివరించారు..
పిల్లలతోనే పల్లె ప్రగతి సాధ్యమని నమ్మారు..
అదే విషయాన్ని చెప్పి.. శెభాష్ అనిపించుకున్నారు..
వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలిసా.
జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు..

ఉరవకొండ, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పిల్లలతోనే పల్లె ప్రగతి అని గట్టిగా చెప్పి జాతీయస్థాయి పురస్కారం దక్కించుకున్నారు వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మండ్ల మోనాలిసా. భారత నాణ్యతా మండలి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్పంచ్ సంవాద్ పోటీల్లో భాగంగా చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌పై జూలై నెలకుగాను మొదటి బహుమతి గెలుచుకున్నారు. రూ.35 వేల నగదు బహుమతి దక్కించుకున్నారు.

ఉన్నత విద్యావంతురాలు.. బోధనానుభవం

మండ్ల మోనాలిసా ఎంఏ బీఈడీ చదివారు. ఐదేళ్లపాటు కాంట్రాక్టు ప్రాతిపదికన ఆదర్శ పాఠశాలలో టీచర్‌గా పనిచేశారు. 2021లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవంతో పలు అంశాలను స్థానికంగా అమలు చేశారు. ఆమె సమయం దొరికినపుడల్లా సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులోనూ ప్రత్యేకతను చాటుకున్నారు. హాస్టళ్లు, మోడల్ స్కూళ్లను తనిఖీ చేస్తూ, విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. విద్యార్థులకు బాల్యవివాహాల నష్టాలు, చదువుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో న్యూఢిల్లీలో నిర్వహించిన మహిళలకు ప్రాతినిధ్యం-2025 అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రథమస్థానం దక్కించుకున్నారు. జూలైలో సర్పంచ్ సంవాద్ పోటీలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌పై ఒకటిన్నర నిమిషం నిడివిగల వీడియో ద్వారా పిల్లల బాగోగులపై తన అభిప్రాయాలను ఆమె పంచుకున్నారు. అందుకు జాతీయస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. దీంతో ఆమెను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, మేజర్ పంచాయతీ ప్రజలు అభినందించారు. కాగా, సర్పంచ్ మోనాలిసాకు భర్త రాజు, కుమార్తె ఉన్నారు.

సర్పంచ్‌కు అభినందనలు



సర్పంచ్‌ను సన్మానిస్తున్న అధికారులు

జాతీయ స్థాయి పురస్కారం దక్కించుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాకు కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్యకుమారి అభినందిస్తూ లేఖ పంపారు. జిల్లా కలెక్టర్ తరఫున మండల అధికారులు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మోనాలిసాను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ దామోదర్ రెడ్డి, కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

ఆవిష్కరణల కార్ఖానా..!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభిస్తున్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం పర్యవేక్షించారు. జేఎన్టీయూలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఇదే లక్ష్యం..

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ఇందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురంలోని ఇన్నోవేషన్ సెంటర్‌కు కియ, జేఎస్‌డబ్ల్యూ సంస్థల ప్రతినిధులను ప్రచారకర్తలుగా అనుసంధానం చేశారు. సెంటర్ నిర్వహణకోసం సెక్షన్-8 కింద రాష్ట్ర ప్రభుత్వం ఒక సొసైటీని ఏర్పాటు చేసింది. జాయింట్ కలెక్టర్ దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సభ్యులుగా ఉంటారు.

ఆలోచన ఉండాలంతే..

ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ అంశాలను జేఎన్టీయూ పర్యవేక్షిస్తుంది. శిక్షణ పొందిన వారికి ఎలాంటి అవకాశాలు కల్పించాలనేది పారిశ్రామికవేత్తలు నిర్ణయిస్తారు. ఇండస్ట్రీ, యూనివర్సిటీ సంయుక్తంగా ఇన్నోవేషన్ హబ్ నిర్వహిస్తాయి. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని అందుకోనున్నారు. ఏ రంగంలోనైనా కొత్త ఆవిష్కరణ ఆలోచన ఉన్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంజనీరింగ్, బీఎస్సీ, బీకామ్ తదిర డిగ్రీలున్న విద్యార్థులే కాకుండా కొత్త విషయాలపై ఆలోచనా సామర్థ్యం మెండుగా ఉండి, సమాజానికి అందించగలనన్న సంకల్పం ఉంటేచాలు అవకాశం కల్పిస్తారు.

స్కిల్ డెవలప్‌మెంట్..

స్కిల్ డెవలప్‌మెంట్ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఈ సెంటర్ కేంద్రంగా పనిచేయనుంది. యువతకు నైపుణ్య శిక్షణ, వినూత్న ఆలోచనలకు ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ఉపాధి అవకాశాలను సృష్టించడమే దీని లక్ష్యం. ఈ ప్రాజెక్టులో గ్రీన్‌కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. సెంటర్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక బాధ్యత కింద ప్రముఖ పారిశ్రామిక సంస్థలు నిధులను సమకూరుస్తాయి.

యువతకు శిక్షణ

వ్యక్తి వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి అంశాలలో యువతకు శిక్షణ ఇస్తారు. పౌర సేవలందించే ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యంగా ఉండనుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్‌వ్యాలీ, ఏఐ వంటి వాటిల్లో స్టార్టప్‌లకు సహకారం అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ సేవలు అందిస్తుంది. టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, ఇంధనం, పునరుత్పాదక ఇంధన రంగాలు, ఫార్మా రంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది.



జేఎన్‌టీయూలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

అవకాశాలకు అడుగులు...

రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రం ప్రారంభంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడుగులు పడనున్నాయి. విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తును అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. విద్యార్థులో నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్టీయూ వీసీ

టీచర్ల నియామకాలకు

కొత్త విధానం

డీఎస్సీ టాపర్లు, కటాఫ్, మెరిట్‌లిస్టుకు చెల్లు

నేరుగా అర్హత అభ్యర్థులకు మెస్సేజ్‌లు..

రాష్ట్రశాఖ ఆదేశాలు.. ఏర్పాట్లపై విద్యాశాఖ కసరత్తు



అనంతపురం విద్య, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ టీచర్ల నియామకాల విషయంలో ఈ సారి కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. గతంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టు, ఏ కేటగిరీ పోస్టు ఎన్ని మార్కుల వరకు ఆగిపోతుందని కటాఫ్ ఇచ్చేవారు. ఈసారి డీఎస్సీ నియామకంలో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు అలా చేయడంలేదు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటికే డీఎస్సీ ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థుల తమ హాల్ టిక్కెట్‌తో విద్యాశాఖ ఇచ్చిన లింకు ద్వారా ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకున్నారు. దీంతో ఏ సబ్జెక్టులో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయి, ఎవరికి ఎక్కువ వచ్చాయో ఇప్పటికీ అభ్యర్థులకు తెలియలేదు. దీంతో ప్రభుత్వం జిల్లాల వారీగా మెరిట్ లిస్టు విడుదల చేస్తుందనీ అపుడు ఏయే కేటగిరీలో ఎన్ని మార్కులు వచ్చి ఉండుంటే పోస్టు వస్తుందో అభ్యర్థులు సులభంగా లెక్కలు కట్టుకునేవారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ తీసుకున్న కొత్త నిర్ణయం మేరకు డీఎస్సీలో వచ్చిన టాపర్లు, మెరిట్ లిస్టు, కటాఫ్ వివరాలను విడుదల చేయడంలేదు. కేవలం పోస్టులు, కేటగిరీల ఆధారంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గుర్తిం చి అర్హత పొందిన అభ్యర్థులకు మాత్రమే మెస్సేజ్‌లు పంపనున్నారు.

- రాష్ట్రశాఖ నుంచి మెస్సేజ్‌లు వచ్చిన అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నారు. రేపో, ఎల్లుండో పరిశీలన కొనసాగించాలనీ, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖకు రాష్ట్ర కమిషనర్ నుంచి ఆదేశాలు పంపారు. దరఖాస్తుల పరిశీలనకు నియమించిన కమిటీలకు మంగళవారం రాష్ట్ర శాఖ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారనీ, ప్రతి కమిటీలో ఒకరిని పంపాలని రాష్ట్ర శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ దరఖాస్తుల పరిశీలనకు 16 కమిటీలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ముగ్గురు ఉన్నారు. అందులో ఒకరిని శిక్షణకు పంపడానికి చర్యలు చేపట్టారు. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఇప్పటికే డీఈఓ ప్రసాద్‌బాబు, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్‌తో కూడిన బృందం జిల్లాలో డీఎస్సీ ఖాళీల జాబితాను తీసుకెళ్లింది. దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాట్లు, శిక్షణకు పంపాలని ఆదేశాలు రావడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు. మొత్తం మీద ఈసారి టీచర్ల నియామకాల్లో టాపర్లు,మెరిట్ లిస్టు, కటాఫ్ విడుదల చేయకుండానే అభ్యర్థులను నేరుగా రాష్ట్రశాఖ మెస్సేజ్‌ల రూపంలో తెలియజేసి వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానించి నియామకాలు చేపడుతుండడంపై అధికారులు, అభ్యర్థుల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

మట్టి దోపిడీ..!

(5వ పేజీ తరువాయి)


అధికారులు అనుమతులు ఇచ్చారు. అనధికారికంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.

చెల్లించేది గోరంత...

మట్టి తవ్వకాల విషయంలో ప్రభుత్వానికి తక్కువ చెల్లించి ఎక్కువ దోపిడీ చేస్తున్నారు. క్యూబిక్ మీటర్‌కు రూ.200 సీనరేజీ ఫీజు, రవాణాకు టన్నుకు రూ.55 మాత్రమే చెల్లిస్తున్నారు. టిప్పర్‌కు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు, ట్రాక్టర్‌కు రూ.3వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. అనుమతి తీసుకున్న లీజుదారులు కొంత పరిధి దాటి అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని సమాచారం. ఇక అనుమతులు లేకుండానే జిల్లా వ్యాప్తంగా భారీగా తవ్వకాలు చేపడుతున్నారు.

రాయల్టీ ఇన్‌స్పెక్టర్ల ముసుగులో వసూళ్లు

మట్టి తవ్వకాల్లో అనేక రకాలున్నాయి. గ్రామాల పరిధిలో ఎక్కువగా పొలాల్లో మార్పు కోసం మట్టిని తవ్వుతుంటారు. ఇక వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు అధికంగా వాడుతుంటారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐ) ముసుగులో కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్ఐల అసిస్టెంట్లమని చెప్పి గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా ట్రాక్టర్లతో మట్టి తరలిస్తుంటే రూ.2వేల నుంచి రూ.3వేలవరకు వసూలు చేస్తుంటారు. వెంచర్లకు తవ్వుతుంటే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.



గార్లదిన్నె మండలం కల్లూరులో వీఆర్వోలపై దాడి జరగడంతో అక్కడికెళ్లిన పోలీసులు (ఫైల్)

జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాల్లో కొన్ని..

- గార్లదిన్నె మండలం కల్లూరు సమీపాన ఎక్స్‌కవేటర్‌తో తవ్వి, ట్రాక్టర్లు, టిప్పర్లతో వెంచర్లకు మట్టి తరలించారు. ఇక్కడ తవ్వకాలకు అధికారుల అనుమతి లేదు. మట్టి తవ్వుతుండగా వారంరోజుల క్రితం స్థానికంగా ఉన్న ఇద్దరు వీఆర్వోలు అడ్డుకున్నారు. వారిపై మట్టి తవ్వకాల్లో కీలకంగా ఉన్న టీడీపీ నాయకులే దాడి చేశారు. అయినా పోలీసులు జోక్యం చేసుకోలేదు.
- అనంతపురం నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లోని కొండలను భారీగా తవ్వేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం మట్టిని టిప్పర్లలో తరలిస్తున్నారు.
- అనంతపురం రూరల్ మండలం చియ్యేడు, క్రిష్ణమరెడ్డిపల్లి, నరసనాయనికుంట, పూలకుంట, ఆలమూరు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వాటి నుంచి లేఅవుట్లకు సరఫరా చేస్తున్నారు. తాటిచర్ల ఎర్రమట్టి తవ్వకాలకు అనుమతులున్నా సమీపంలో తాజాగా ఓ ఇరిగేషన్ అధికారి సాయంతో నల్లమట్టి తవ్వారు. వర్షాలు కురుస్తుండటంతో ఈ మధ్యనే ఆపేశారు.
- బుక్కరాయసముద్రం సమీపాన, శింగనమల మండలం కొరివిపల్లి, నార్పల మండలం మడుగుపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. వీటికి అనుమతులే లేకపోవడం గమనార్హం.
- రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి వద్ద 2 హెక్టార్ల వరకు అనుమతి ఉన్నా... అంత కంటే ఎక్కువే గత ప్రభుత్వ హయాంలో తవ్వేశారు.
- గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు సమీపాన జాతీయ రహదారి పక్కన, పామిడి మండలంలో కొన్ని గుట్టలను తవ్వి మట్టి తరలిస్తున్నారు.
- యాడికి మండలంలోని యాడికి-తిరుణాంపల్లి రోడ్డు పక్కనున్న 40ఎకరాల గుట్టలో మట్టిని రియల్ వ్యాపారులు తవ్వేశారు.
- ఉరవకొండ సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువకు సంబంధించిన మట్టి తరలిస్తున్నారు. అనుమతులు లేకపోయినా ఓ వైసీపీ నాయకుడి వెంచర్‌కు ట్రాక్టర్లతో సరఫరా చేస్తున్నారు.
- డీ హిరేహాళ్ మండలంలోని కర్ణాటక సరిహద్దులో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. బళ్లారి-బెంగళూరు రహదారి నిర్మాణంలో మట్టిని వాడుతున్నారు.



యాడికి మండలంలో 40 ఎకరాల్లోని గుట్టలో మిగిలింది ఇదే..

అక్రమ తవ్వకాలు నిజమే...



జిల్లాలో కొన్నిచోట్ల అక్రమ తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికొచ్చింది. పది నెలలుగా రూ.15లక్షల వరకు జరిమానా విధించాం. సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో దాడులు చేయలేకపోతున్నాం. అనుమతి లేకుండా మట్టిని రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం.

- ఆదినారాయణ, గనుల శాఖ ఇన్‌చార్జి ఏడీ

కోర్టులో ఉద్యోగాలకు నేటి నుంచి పరీక్షలు

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఆధ్వర్యంలో స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఎగ్జామినర్, ఫీల్డ్ అసిస్టెంట్, కాపీయిస్టు, ప్రాసెస్ సర్వర్, డ్రైవర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి బుధవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలు గేట్లు 15 నిమిషాల ముందే మూసివేస్తారని, అభ్యర్థులు గమనించి, త్వరగా చేరుకోవాలని సూచించారు. గేట్లు మూసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించబోమని అన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో ఉన్న గుర్తింపుకార్డులు, హాల్‌టిక్కెట్లు తీసుకెళ్లాలని సూచించారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్, ఇతర సమస్యలు ఉంటే 0863-237252 నంబరకు ఫోన్ చేయాలని, లేదంటే helpdesk.hc.ap@aij.gov.in మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షే తుది పరీక్ష అని, మౌఖిక పరీక్ష ఉండదని, అభ్యర్థులు గమనించాలని సూచించారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, టైపిస్టు, కాపీయిస్టు, డ్రైవర్(లైట్ వెహికల్) పోస్టులకు స్కిల్ టెస్టు ఉంటుందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులను స్కిల్ టెస్టుకు రావాలని సమాచారం అందిస్తారని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయి.

సెల్‌ఫోన్ రిపేరీ కోసం వెళ్లి మృత్యువాత

ఆటో బోల్తాపడి విద్యార్థి మృతి



నందకిషోర్ (ఫైల్)

ముదిగుబ్బ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనగారిపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఆటో బోల్తాపడి వీసీరేవు గ్రామానికి చెందిన విద్యార్థి నందకిషోర్(14) మృతి చెందినట్లు ముదిగుబ్బ పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్ రిపేరీ కోసం నందకిషోర్ మరికొందరితో కలిసి ఆటోలో ముదిగుబ్బకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సిద్ధనగారిపల్లి గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన నందకిషోర్‌ను స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆటో మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడు ఉప్పలపాడు బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి వేణుగోపాల్(66) హౌసింగ్ బోర్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించారు. ఓ అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తన భర్త మరణించారంటూ మృతుడి భార్య నాగరత్నమ్మ ట్రాఫిక్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తన భర్త వేణుగోపాల్ సోమవారం విద్యుత్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి గుడికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. 8.30 గంటలప్పుడు కుమార్ ఆసుపత్రి వద్దకు రాగానే ఏపీ 39-టీఎస్0767నెంబర్ అంబులెన్స్ కుడి వైపు డోర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా తెరవడంతో అది స్కూటర్‌కు తగిలి కింద పడి గాయపడ్డాడన్నారు. తొలుత కుమార్ ఆసుపత్రికి, తర్వాత సవీరా ఆసుపత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు యాక్సిడెంట్‌కు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను సేకరించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం... బాలుడి దుర్మరణం

కనగానపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో ఓ టిప్పరు డ్రైవరు నిర్లక్ష్యం ఓ బాలుడు ప్రాణం తీసింది. స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా సోలేపల్లికి చెందిన రామాంజనేయులు తన కుమారుడు వినయ్(7)తో కలిసి ద్విచక్ర వాహనంపై అనంతపురం నుంచి సొంతూరికి వెళుతున్నాడు. తల్లిమడుగుల వద్ద ముందు వెళుతున్న టిప్పర్ ఆగింది. దీంతో వెనకున్న రామాంజనేయలు తన ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా పోనిచ్చాడు. అయితే ఎదురుగా మరో టిప్పరు రావడంతో అకస్మాత్తుగా టిప్పరు డ్రైవర్ తన వాహనాన్ని వెనకకు రివర్స్ చేశాడు. దీంతో వెనుక ద్విచక్రహనంపై ఉన్న తండ్రి, కొడుకు కింద పడ్డారు. టిప్పర్ వెనుకకు రావడంతో దానికింద పడి వినయ్ అక్కడికక్కడే మృతిచెందగా తండ్రి రామాంజనేయలు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవులో జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ వారం రోజులపాటు వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. దీంతో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ 10 రోజులపాటు సెలవు కోరితే వారం రోజులే మంజూరు చేశారన్న చర్చ జరుగుతోంది. ఈక్రమంలో మరోసారి సెలవు పొడిగించుకొనే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

మార్పు వద్దా..?

- మార్పు ద్వారా విజేతలు శిక్షణకు ఇద్దరే హాజరు..

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రజాప్రతినిధులను చైతన్యపరిచేందుకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలు సఫలం కావడం లేదు. మార్పు ద్వారా విజేతలు.. మహిళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇదివరకే రెండు విడతల్లో శ్రీ కాళహస్తిలో కొందరికి శిక్షణ ఇచ్చారు. అయితే మిగిలిన వారికి మంగళవారం నుంచి గురువారం వరకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. దాదాపు 50 మంది దాకా వస్తారని అధికారులు అంచనా వేయగా గాండ్లపెంట, రాప్తాడు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన రెండు రోజులకు అయిన మహిళా సభ్యులు హాజరు కావాలని సమాచారం అందించారు. తమకు పదవీకాలం ఇక ఏడాదిలోపే ఉందన్న కారణంతో చాలా మంది శిక్షణకు రాలేదన్న ప్రచారం జరుగుతోంది.

24న టీటీసీ థియరీ పరీక్షలు

అనంతపురం విద్య, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): టీటీసీ థియరీ పరీక్షలు ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ వెంకటేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మళ్లీ 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటలవరకు మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాకేంద్రంలోని మొదటి రోడ్డులోగల శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. హాల్‌టిక్కెట్ తోపాటు ఏదైనా గుర్తింపు కార్డుతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం వేధింపుల ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన తుంగా రేఖకు, కొత్తపేటకు చెందిన రంగం ఆంజనేయులుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో 14 తులాల బంగారం ఇచ్చారు. ఆంజనేయులు పట్టుచీరల వ్యాపారం చేస్తున్నాడు. వీరికి పిల్లలు లేరు. పెళ్లయిన మూడునెలల వరకు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత ఆంజనేయులు వ్యసనాలకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ భార్య బంగారమంతా బ్యాంకులో తాకట్టు పెట్టాడు. విషయాన్ని తుంగా రేఖ.. అత్తమామలకు చెప్పినా వారు కూడా ఆంజనేయులుకు మద్దతు పలికారు. విషయాన్ని తుంగా రేఖ తన తల్లి దండ్రులకు చెప్పగా వారు పంచాయితీ పెట్టి చెప్పినా ఎటువంటి మార్పు రాలేదు. రెండేళ్లుగా భర్త, అత్తమామలు అదనంగా డబ్బులు కావాలని తుంగా రేఖను వేధిస్తుండేవారు. దీంతో రేఖ పుట్టింటికి వచ్చేసింది. అయినా ఆంజనేయులు వేధింపులు ఆగలేదు. వాటిని భరించలేక మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఆమె భర్త ఆంజనేయులు, అత్త లక్ష్మీదేవి, మామ రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

పగలు బొగ్గులు.. రాత్రి దోపిడీలు

పాణ్యం ముఠాకు రాయచోటి వ్యక్తి సాయం

చెక్కవారిపల్లి నుంచి నెలకు సరిపడా సరుకులు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చెక్కవారిపల్లి అటవీ ప్రాంతంలో పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా వ్యవహారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతంలో ఈ ముఠా ఆరు నెలలుగా గుడారాలు వేసుకుని ఉంటోంది. తనకల్లు, కదిరి రూరల్, పాణ్యం పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి వీరిని పట్టుకున్నారు. వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్‌ల నిఘా పెట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా వీరు తనకల్లు మండలంలోని దిగువ చెక్కవారిపల్లికి చేరినట్లు సమాచారం. అక్కడి నుంచి నెల క్రితం అటవీప్రాంతానికి మకాం మర్చారు. వీరందరూ నంబులపూలకుంట మండలం పెడుల్లి వద్ద బొగ్గులు కాల్చే పనికి వెళ్లేవారు. వీరికి చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రతి నెలా తినడానికి కావలసిన సరుకులు వెళ్లేవని సమాచారం. రాయచోటికి చెందిన శేఖర్‌కు చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారానే శేఖర్ దొంగల ముఠాకు సాయం అందించాడని సమాచారం. పగటిపూట బొగ్గులు కాల్చి, రాత్రిళ్ల దోపిడీలకు పాల్పడేవారని సమాచారం.

చేనేత కార్మికుడి అదృశ్యం



ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మురళి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మకాలనీలో మురళి, కుంటిమద్ది రమ్య దంపతులు జీవిస్తున్నారు. మనస్పర్థల కారణంగా ఇటీవలిగా దంపతులు గొడవపడేవారు. మురళి మగ్గం పని గిట్టుబాటు కాక అప్పులు చేశాడు. వాటిని కట్టలేక ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఒకటిన్నర నెల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రమ్య బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద గాలించింది. ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మురళి (ఫైల్)

విడపనకల్లు వెళ్లాలంటే.. టిక్కెట్ కొనాల్సిందే..!

స్త్రీ శక్తికి దూరంగా మండలం

ఒక్క ఉచిత బస్సు సర్వీసూ నడపని ఆర్టీసీ

మహిళలపై భారం



బస్సు బోర్డుపై అంతర్రాష్ట్ర సర్వీసు అని రాసిన దృశ్యం

విడపనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ యోగం దక్కట్లేదు. ఒక్క ఉచిత బస్సు సర్వీసు కూడా లేకపోవడమే ఇందుకు కారణం. కర్ణాటక సరిహద్దులో మండలం ఉండడమే ఇందుకు కారణం. మండలం మీదుగా బళ్లారి, అనంతపురం మధ్య రోజూ వంద బస్సులుపైగా తిరుగుతుంటాయి. అవన్నీ ఎక్స్‌ప్రెస్‌లు, అల్ట్రా డీలక్స్ బస్సులే. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ బస్సులను ప్రకటించిన తరువాత ఈ బస్సులు అన్నింటికీ అంతర్రాష్ట్ర సర్వీసులుగా బోర్డులు తగిలించారు. దీంతో మండలంలోని మహిళలకు ఉచిత ప్రయాణ యోగం లేకుండా పోయింది. విడపనకల్లు నుంచి ఉరవకొండకు వెళ్లాలన్నా అంతర్రాష్ట్ర సర్వీసుల్లో టిక్కెట్ కొనాల్సిందే. అనంతపురం నుంచి విడపనకల్లు రావాలన్నా ఉరవకొండ వరకు మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుంది. అక్కడి నుంచి విడపనకల్లుకు టిక్కెట్ కొనాల్సిందే. విడపనకల్లుకు ఒక్క పల్లె వెలుగు సర్వీసు కూడా లేదు. విడపనకల్లు వరకూ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని మండలానికి చెందిన మహిళలు కోరుతున్నారు.

విడపనకల్లుకు టిక్కెట్ తీసుకోవాల్సిందే

విడపనకల్లు మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఫ్రీ సర్వీసులు లేవు. ఉరవకొండ నుంచి విడపనకల్లు మీదుగా అన్ని బస్సులు బళ్లారికి వెళ్తుండటంతో అవి అంతర్రాష్ట్ర సర్వీసుల కిందకు వస్తాయి. వాటిలో ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. సరిహద్దు వరకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే చర్యలు తీసుకుంటాం.

-హంపయ్య, డిపో మేనేజర్, ఉరవకొండ

ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

కళ్యాణదుర్గం (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పట్ల మహిళలు ఆనందంగా ఉన్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళల వద్దకెళ్లి ఉచిత ప్రయాణం ఎలా ఉందంటూ ఆర్టీసీ ఎండీ అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణంతో డబ్బులు ఆదా అవుతున్నాయనీ, ఎంతో సంతోషంగా ఉన్నామని వారు చెప్పారు. ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ 93 శాతానికి పెరిగిందన్నారు. కొన్ని ఆర్టీసీ డిపోల్లో 106 శాతం ఆక్యుపెన్సీ వచ్చినట్లు తెలిపారు. కర్ణాటక సరిహద్దు మండలాలకు ఉచిత ప్రయాణం అమలు కావడంలేదనీ, అవకాశం కల్పించాలని ప్రయాణీకులు.. ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సులో మహిళతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ

తాడిపత్రి వైపు పెద్దారెడ్డి.. అడ్డుకున్న పోలీసులు

అనంతపురానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వైపు వెళ్తున్నాడన్న సమాచారంతో పోలీసుల్లో హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది. చుట్టుపక్కల పోలీసు స్టేషన్లతోపాటు సిబ్బందిని అలర్ట్ చేసి, ఆయా రహదారుల్లో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పెద్దారెడ్డి మాత్రం యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రి వైపు రావడంతో బుక్కాపురం వద్ద పోలీసులు అడ్డగించారు. తాను అనంతపురం వెళ్తున్నానని చెప్పినా వారు ఒప్పుకోలేదు. ఆయన కాన్వాయ్ వెంబడే బయలుదేరారు. కొండాపురం సమీపంలో సూరేపల్లి వద్దకు రావడంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రికి వెళ్లకూడదనీ, వెనక్కి వెళ్లాలని చెప్పినా ఆయన వినలేదు. కోర్టు అనుమతి ఉందనీ, తనను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు మాత్రం ససేమిరా అన్నారు. అంతలోనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అనంతపురం నుంచి తిరిగి వస్తున్నాడని తెలియడంతో ఎదురుపడితే ఘర్షణ పడే అవకాశం ఉందన్న ఆలోచనతో పెద్దారెడ్డిని అరగంట ఆపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కొండాపురం దాటి వెళ్లిన తర్వాత అనంతపురం వైపు పెద్దారెడ్డిని పంపించారు. మళ్లీ వెనక్కి వస్తాడేమోనని పోలీసులు కాన్వాయ్‌తోపాటు అనంతపురం వరకు వెళ్లారు. ఆయన తిరిగి రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కిటకిటలాడిన అంజన్న ఆలయాలు

గుంతకల్లు/బొమ్మనహాళ్/డీ.హీరేహాళ్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస చివరి మంగళవారాన్ని పురస్కరించుకుని గుంతకల్లు సమీపంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం, డీ.హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. నెట్టికంటి మూల విరాట్టుకు వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలతో అలంకరించారు. రాత్రి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఉంచి.. ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. నేమకల్లులో స్వామి వారికి తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురడి ఆంజనేయస్వామిని వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు.



కసాపురం



నేమకల్లు



మురడి

తహసీల్దార్ కార్యాలయంలోనే

వీఆర్ఏ ఆత్మహత్యాయత్నం

భూమి వివాదంలో వీఆర్వో, మునుపటి తహసీల్దార్ అన్యాయం చేశారని ఆరోపణ

నల్లచెరువు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే ఓరువాయి వీఆర్ఏ రంగస్వామి మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన వీఆర్ఏ రంగస్వామికి, దాయదులకు కొన్నేళ్లుగా భూవివాదం ఉంది. కోర్టుకు కూడా వెళ్లారు. సర్వే నంబరు 396/1, 396/2లో తనకు రావలసిన హక్కు భూమిని కూడా ఓరువాయి వీఆర్వో నిర్మల, గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన రవికుమార్ కలిసి మరొకరి పేరున పాసుపుస్తకం జారీ చేశారని బాధిత వీఆర్ఏ ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై అధికారుల వద్దమొరపెట్టుకున్నా, న్యాయం చేయలేదన్నారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించానన్నారు. గమనించిన తోటి ఉద్యోగులు నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కదిరి ఆస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. భూవివాదంపై వీఆర్వో నిర్మల మాట్లాడుతూ.. రంగస్వామి భూమి వివాదం కోర్టులో నడుస్తోందన్నారు. కోర్టులోఉన్న భూమికి ఇంజక్షన్ ఆర్డర్ లేకపోవడంతో ఉన్నతాధికారుల సలహా మేరకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే చేశామన్నారు. రంగస్వామి సాగు విస్తీర్ణం కంటే అండగల్‌లో ఎక్కువ భూమిని ఎక్కించుకున్నారన్నారు. రంగస్వామి దాయాదులు, పెద్ద మనుషుల సమక్షంలో హక్కు ఉన్న మేరకు పాసుపుస్తకంలో ఎక్కించామన్నారు.

కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్ఏ రంగస్వామి



డాక్టర్ కత్తి పద్మారావుకు

జీవిత సాఫల్య పురస్కారం



అనంతపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసి చేసిన సాహితీవేత్త, సంస్కృతాంధ్ర పండితులు డాక్టర్ కత్తి పద్మారావును విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం వరించింది. 2025 సంవత్సరానికి ఆయనను పురస్కారానికి ఎంపిక చేశారు. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి(రాయలసీమ), కేపీ అశోక్‌కుమార్(తెలంగాణ), గంటేడ గౌరునాయుడు(కోస్తా) న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, డాక్టర్ కత్తి పద్మారావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో త్వరలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తామని విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసమితి వ్యవస్థాపకులు డాక్టర్ శాంతినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ కత్తి పద్మారావుకు పురస్కారం, నగదు బహుమతి అందజేసి సత్కరిస్తామని ఆయన తెలిపారు.

హిందూపురంలో

వందే భారత్ ఆగుతుంది: సోమన్న

బర్కత్‌పుర, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరం నుంచి హిందూపూర్ వెళ్లే ప్రయాణికులకు శుభావార్త చెప్పారు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20703) హిందూపూర్‌లో ఆగుతుందని (హాల్టింగ్) మంత్రి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీనిని రైల్వే బోర్డు ఆమోదించినట్లు తెలిసింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉదయం 5.45 నిమిషాలకు బయల్దేరి మహబూబ్‌నగర్‌కు ఉదయం 6.54 నిమిషాలకు కర్నూలు ఉదయం 8.28 నిమిషాలకు, అనంతపురానికి ఉదయం 10.43 నిమిషాలకు, ధర్మవరానికి ఉదయం 11.10 నిమిషాలకు చేరుతుంది. హిందూపూర్‌కు ఉదయం 11.40 నిమిషాలకు చేరే అవకాశం ఉంటుంది. ఈ రైలు యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 2.45 నిమిషాలకు బయల్దేరి రాత్రి 11గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఏ తేదీ నుంచి వందే భారత్ రైలు హిందూపురంలో ఆగుతుందో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

చిరుజల్లులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, కూడేరు, శింగనమల, విడపనకల్లు, బొమ్మనహాళ్, గుత్తి, పుట్లూరు, పామిడి, గార్లదిన్నె మండలాల్లో చిరుజల్లులు రాలాయి. సోమవారం 18 మండలాల్లో వర్షం పడింది. బెళుగుప్పలో 0.64 సెం.మీ., యాడికి, కళ్యాణదుర్గం 0.60, బ్రహ్మసముద్రం 0.52, తాడిపత్రి 0.42, బుక్కరాయసముద్రం 0.32, డి హిరేహాళ్ 0.24, రాయదుర్గం, కూడేరు 0.22, విడపనకల్లు 0.2, గుత్తి, గుమ్మఘట్ట 0.18, గుంతకల్లు, పామిడి, యల్లనూరు 0.14 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 0.12 సెం.మీ. లోపు కురిసింది.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

హిందూపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బాలికను బెదిరించి, అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి సుధాకర్‌కు అనంతపురం పోక్సో కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. హిందూపురం పట్టణంలోని లక్ష్మీపురంలో ఉంటున్న వడ్డె సుధాకర్ 2022 జనవరి 7న 15 ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి బెంగళూరుకు, అక్కడి నుంచి కదిరికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో వన్‌టౌన్ సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ దాదాపీర్ కేసు నమోదు చేశారు. బెంగళూరులో ఉన్న సుధాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువైందని న్యాయాధికారి చిన్నబాబు ప్రకటించారు. అత్యాచారం చేసినందుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాలికను బెదిరించినందుకు మరో మూడేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించారు. బాధితురాలి తరఫున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదించారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐని ఎస్పీ రత్న అభినందించారు.

ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలోని బీ ఫార్మసీ, ఫార్మా డీ, బీపీఏ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, ప్రొఫెసర్లు శివకుమార్, శంకర్‌శేఖర్ రాజు, శ్రీధర్, అంకారావు ఫలితాలను వెల్లడించారు. బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా డీ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ, బీపీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. జేఎన్‌టీయూఏ వెబ్ సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని ఆచార్య నాగప్రసాద్ నాయుడు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 13న నిర్వహించనున్నట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై అన్నిశాఖల అధికారులతో వారు మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత ప్రజాప్రయోజన వ్యాజ్య న్యాయ సేవలు వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎంబీఓపీ కేసులు, కొళాయి పన్ను కేసులు, ఇంటి పన్ను కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేయాలని అధికారులకు సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశ గడువు పొడిగింపు

కొత్తచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశ గడువును సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో చేరే వారికి 14 సంవత్సరాలు, ఇంటర్‌లో చేరే వారికి 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఈ అవకాశం అపరాధ రుసుం రూ.200 చెల్లించిన వారికి మాత్రమే లభిస్తుందన్నారు. సమాచారం కోసం ఏఐ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

పురంలో అదృశ్యం.. కర్ణాటకలో మృతి



అర్చన (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకంఠపురం కాలనీకి చెందిన అర్చన(27) కర్ణాటకలో మృతిచెందారు. ఈ నెల 13న క్యాటరింగ్ పనులకు వెళ్లిన అర్చన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త నాగరాజు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, కర్ణాటకలోని మంచేపల్లిలో గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు అక్కడి పోలీసులు మంగళవారం సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి.. మృతదేహం అర్చనదేనని గుర్తించారు. ఆమెకు ఇన్‌స్టాలో ఒకరు పరిచయమయ్యారని, అతనే హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. అర్చనకు రెండేళ్ల కూతురు ఉంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ కరీం అన్నారు.

గొలుసు లాక్కెళ్లిన కేసులో ఇద్దరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్కూటీలో వెళ్తున్న మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను త్రీటౌన్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి గొలుసు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక స్టేషన్‌లో త్రీటౌన్ సీఐ శాంతిలాల్ వెల్లడించారు. కంబం నాగార్జున (25) అలియాస్ నాగార్జున రెడ్డి అలియాస్ చిన్నా ఆటో డ్రైవర్. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ సొంతూరు. అనంతపురంలోని కలెక్టరేట్ వద్ద నివాసం ఉంటున్నాడు. పేకాట, తాగుడుకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ జూదంలోనూ డబ్బులు పోగొట్టుకున్నాడు. జల్సాల కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. అతడి స్నేహితుడు శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడకు చెందిన బోజనోల వరప్రసాద్ కదిరిలో నివాసం ఉంటున్నాడు. నాగార్జున.. ఫ్రెండ్ వరప్రసాద్‌ను పిలిచి సులభంగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్ చేద్దామంటూ సలహా ఇచ్చాడు. ఇద్దరూ ఈ ఏడాది జూన్ 21న నేషనల్ పార్కు వద్ద చైన్ స్నాచింగ్‌కు ప్లాన్ వేసుకున్నారు. అక్కడ స్కూటీపై ఇద్దరు మహిళలు వెళ్తుండగా వెంబడించారు. స్కూటీ దగ్గరకు వెళ్లి స్కూటీ వెనుక చక్రంలో గాలి తగ్గిందంటూ చెప్పారు. మహిళ స్కూటీ ఆపి, కిందకు దిగి చూస్తుండగానే.. ఆమె మెడలోని బంగారు తాళి బొట్టు చైన్ లాగేసుకుని పారిపోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన సీఐ శాంతిలాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఆర్టీసీ స్టాండ్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 23 గ్రాముల బంగారు చైన్, 1.5 గ్రాముల బంగారు తాళిగొట్టు, బంగారు లక్ష్మీకాసు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కదిరి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమనాయునిపాళ్యం వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి దాదాపు 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి ఎక్కడనుంచి వస్తోంది, ఎవరికి విక్రయిస్తున్నారన్న దానిపై పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

న్యూస్ బాక్స్

యూరియా కోసం రైతుల ధర్నా



డీసీఎంఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి సరిపడా యూరియా ఇవ్వాల్సిందేనని అన్నదాతలు ఆందోళనకు దిగారు. మంగళవారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయం ఎదుట యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. బయట ఉన్న ఫర్టిలైజర్ షాపులలో ఉన్న యూరియాను రైతులకు సరఫరా చేయాలన్నారు. అవసరానికి అనుగుణంగా పంటల సాగుకు యూరియా ఇవ్వాలన్నారు. డీసీఎంఎస్, వ్యవసాయ అధికారులు జోక్యం చేసుకుని రైతులందరికీ యూరియా అందజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. రైతుల ధర్నాకు సీపీఎం నాయకులు బీహెచ్ రాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి మద్దతు తెలిపారు.

ఓర్వలేకే అమరావతిపై విష ప్రచారం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్



అనంతపురం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక...అమరావతిపై వైసీపీ నేత జగన్‌రెడ్డి విషం చిమ్ముతున్నాడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ మండిపడ్డారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు పేరుతో ముక్కలు చేసి, అమరావతి అభివృద్ధిని అడ్డుకుందని అన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ముందుకెళ్తున్నారన్నారు. వైసీపీ నాయకులు శాడిస్టు సైకో వేషాలు వేస్తూ అమరావతి ముంపు ప్రాంతంలో ఉందంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

పాఠశాలకు డ్రమ్స్, మైక్‌సెట్ వితరణ



పాఠశాలకు డ్రమ్స్, మైక్‌సెట్ అందజేస్తున్న నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రుద్రంపేట పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డ్రమ్స్, మైక్‌సెట్, లౌడ్ స్పీకర్లు వితరణ చేశారు. మంగళవారం పాఠశాలలో రూ.30వేలు విలువ చేసే డ్రమ్స్‌ను టీడీపీ నాయకులు పతకమూరి కుమార్‌నాయుడు, మరో రూ.30వేలు విలువ చేసే మైక్ సెట్, లౌడ్ స్పీకర్స్‌ను జూటూరు వెంకటేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమంగళి ఆధ్వర్యంలో పాఠశాలకు అందించారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

అనంతపురంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలమూరు రోడ్డులోని బాలాజీ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈగల్ క్లబ్ ఎస్ఐ హనుమంత్ హాజరై మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై ఆందోళన వద్దు

గార్లదిన్నె, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పింఛన్లు తొలగించినట్లు నోటీసులు వచ్చిన వారెవరూ ఆందోళన చెందవద్దని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. పింఛన్‌దారులకు నోటీసులు రావడంతో వారు మంగళవారం స్థానిక ఎంపీడీఓ యోగానందరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పింఛన్ తీసుకోవడానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. అయినప్పటికి తొలగించినట్లు నోటీసులు ఇవ్వడం ఏంటి సార్ అని వాపోయారు. నోటీసులు తీసుకున్న వారు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలన్నారు. అర్హులని నిర్ధారిస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఎస్కేయూ టైంస్కేల్ ఉద్యోగి మృతి

అనంతపురంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో టైంస్కేల్ అటెండర్‌గా పనిచేస్తున్న నరసింహులు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఉద్యోగ సంఘం నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. సంఘం నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, శివయ్య, సంజీవప్ప, నారాయణప్ప, తిమ్మప్ప, నాగమునీంద్ర, మారుతి నివాళుర్పించిన వారిలో ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద మంగళవారం సాయంత్రం రవినాయక్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన రవినాయక్ గార్లదిన్నె ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురం తరలించారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

కనగానపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని ఏడీఏ లక్ష్మానాయక్, ఏరియా కో ఆర్డీనేటర్ రామసుబ్బయ్య తెలిపారు. మామిళ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వారు రైతులతో సమావేశమయ్యారు. అనంతరం ముక్తాపురం, మామిళ్లపల్లి, పర్వతదేవరపల్లి గ్రామాల్లో కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ మాధురి, ఏఈఓ వీరాంజనేయులు, వీఏఏ త్రినాథ్‌రెడి పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు..!

● కోటంక ప్రయాణం నరకప్రాయం
● పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంతలమయమైన మర్తాడు-కోటంక రహదారి

గార్లదిన్నె, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ గ్రామ సమీపంలోని కొండపై గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వయంభూగా వెలిశాడు. ఇంతటి ప్రత్యేకత గల గ్రామ ప్రధాన రహదారిలో అడుగకో గుంత ఏర్పడి ప్రయాణం నరక ప్రాయంగా మారింది. గార్లదిన్నె మండల కేంద్రానికి 14 కిలో మీటర్ల దూరంలో కోటంక ఆలయం ఉంది. దేవాలయానికి గార్లదిన్నె నుంచి మర్తాడు మీదుగా కోటంకకు వెళ్లాల్సి ఉంటుంది. గార్లదిన్నె నుంచి మర్తాడు మీదుగా కోటంక వరకు అడుగుకో గుంత ఉంది. దీంతో ఆ రోడ్డు పై ప్రయాణం చేయాలంటే సుమారు గంటకు పైగా పడుతుంది. దీనికి తోడు దుమ్ముదూళి వస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వస్తే బురద నీరంతా గుంతల్లో చేరుతుండడంతో భయం భయంగా వాహనాలు నడుపుతున్నారు. ఆ రోడ్డు పై నిత్యం కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొందని భక్తులు, ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్డుకు గంపెడు మట్టి కూడా వేసిన దాఖలాలు లేవని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

గార్లదిన్నె నుంచి మర్తాడు, కోటంక రోడ్డు గుంతలమయంగా ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం గార్లదిన్నె సమీపంలోని పెట్రోల్ బంకు నుంచి మర్తాడు వరకు 4 కిలో మీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మర్తాడు నుంచి కోటంక వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం.

- శ్రీనివాసులు, జేఈ, పంచాయతీరాజ్ శాఖ

సొంత డబ్బుతో గుంతలు పూడ్చా



మర్తాడు క్రాస్ నుంచి కోటంకకు ప్రయాణం నరకయాతనే. వాహనాలు వెళితే రోడ్డంతా దుమ్ముదూళితో ఇబ్బందులు పడాల్సిందే. మర్తాడు నుంచి గార్లదిన్నె క్రాస్ వరకు రూ.70వేలు సొంత డబ్బులతో మట్టి తోలించాను. రోడ్డు వేస్తే కోటంక సుబ్రహ్మణ్యశ్వరస్వామికి వచ్చే భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

- అవుల క్రిష్ణయ్య, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు, మర్తాడు

ప్రయాణం.. నరకప్రాయం



మర్తాడు- కోటంక రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా ఉంది. అడుగుకో గుంత ఏర్పడడంతో వర్షాకాలంలో ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 14 కిలో మీటర్లు గంటకు పైగా ప్రయాణం పడుతుంది.

-ఉప్పర వెంకట్రాముడు, మర్తాడు

ప్లాస్టిక్ నిషేధం అమలులో అనంత బెస్ట్: సీడీఎంఏ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీఎంఏ సంపత్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధం అమలు, పర్యావరణ పరిరక్షణపై అనంత నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే ఉత్తమంగా ఉందని సీడీఎంఏ సంపత్‌కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆయన మొదట అనంత నగరపాలక సంస్థ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్లాస్టిక్‌నిషేధంపై సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం అమలుపై ఐదు నగరాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిందని, ఇందులో అనంతపురం ఒక్కటని తెలిపారు. ఇక్కడ చేపట్టిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణలకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్లు, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుక్కల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

అనంత నగరపాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా నగరవాసులు ఎదుర్కొంటున్న కుక్కల సమస్యకు అతి త్వరలో పరిష్కారం చూపుతామని సీడీఎంఏ సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక కంపోస్ట్ యార్డు వద్ద ఉన్న కుక్కల కన్నెల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీడీఎంఏ మాట్లాడుతూ కన్నెల్స్ (టీకా కేంద్రం) నిర్వహణ బాగుందని, కన్నెల్స్ సంఖ్యను రెట్టింపు చేయాలని సూచించారు. అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) టీకా ఆపరేషన్‌పై ప్రతిపాదనలు పంపాలని ఏంఎసీ కమిషనర్ బాలస్వామిని ఆదేశించారు.

సీడీఎంఏకు వినతుల వెల్లువ

జిల్లాకు వచ్చిన కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) సంపత్‌కుమార్‌కు పలువురు వినతులు అందజేశారు. నగరంలో తీవ్రంగా ఉన్న కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నగర మేయర్ మహ్మద్ వసీం సీడీఎంకే వినతిపత్రం అందజేశారు. గత 17నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు సీడీఎంఏను కోరారు. గడప గడప నిధులు వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు. 15 సంవత్సరాలు పైబడిన కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులందరికీ పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లకు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు సీడీఎంఏకు వినతిపత్రం అందజేశారు. సీనియార్టీ జాబితా ప్రకటించి అర్హులైన గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీ నారాయణ, వరప్రసాద్, రామకృష్ణ, మల్లికార్జున, రాఘవేంద్ర, కిశోర్ కోరారు. మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీడీఎంఏకు వినతిపత్రం అందజేశారు.

ప్రశ్నార్థకంగా డీడీఓ కార్యాలయ ఏర్పాటు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నిధుల లేమితో డీడీఓ కార్యాలయ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. అన్ని వసతులతో ఈ నెల 19లోపు ఏర్పాట్లు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశించారు. దీంతో గత వారం సీఈఓ శివశంకర్ సంబంధిత సిబ్బందితో తమ చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి దిశనిర్దేశం చేశారు. అనంతపురానికి రెగ్యులర్ డీడీఓ లేకపోవడంతో వాటి గురించి అంతగా పట్టించుకోలేదు. డీడీఓగా నాగశివలీల బాధ్యతలు చేపట్టడంతో సంబంధిత అధికారుల్లో టెన్షన్ మొదలైంది. జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యలు పీఆర్ డీఈ లక్ష్మీనారాయణ, జేఈఈ వెంకటశేషయ జడ్పీ ఆవరణలోని ఖాళీ భవనాలను పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం సమీపంలో ఉన్న భవనాన్ని పరిశీలించగా రెన్నొవేషన్ కష్టమని భావించారు. పీఆర్ సబ్‌డివిజన్-2 కార్యాలయం ప్రక్కనే ఉన్న ఆడిట్ విభాగానికి కేటాయించిన భవనాన్ని పరిశీలించారు. సబ్‌డివిజన్-1 పక్కన ఉన్న భవనాన్ని కేటాయిస్తే ఎలా ఉంటుందన్నది చర్చించారు. ఇవన్నీ కాదని ఎంపీడీఓ దివాకర్, డీడీఓ నాగశివలీల మరో ప్రాంతానికి వెళ్లి కొన్ని కార్యాలయాలను పరిశీలించి వచ్చారు. దేన్ని ఫైనల్ చేయాలన్నది ప్రశ్నార్థకరంగా మారింది. ఏ భవనం కేటాయించినా మరమ్మతులు చేయించాల్సి ఉండటం, కనీసం రూ.5 లక్షల వరకు ఖర్చు చేసే పరిస్థితి ఉంది. కమిషనర్ విధించిన గడువు మంగళవారంతో ముగిసిందని, మరోసారి కమిషనర్ డీడీఓ కార్యాలయం గురించి ప్రశ్నిస్తే ఏమి చెప్పాలో అర్థం కాక అధికారులు ఆందోళన చెందుతున్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాప్తాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర స్థాయిలో జరిగిన క్లస్టర్ -7 సీబీఎస్ఈ క్రీడల్లో మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ సమీర, ఎండీ కృష్ణభరత్ తెలిపారు. జూలై 24, 25, 26న హైదరాబాద్‌లో జరిగిన వాలీబాల్ అండర్ -19 బాలికల విభాగంలో పాఠశాల బాలికలు సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఆగస్టు 9, 10, 11న రాజమండ్రి తునిలో జరిగిన క్లస్టర్ -7 సీబీఎస్ఈ ఖోఖో అండర్- 17 బాలికల విభాగంలో ఇంటర్ స్ట్రేట్ లెవల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

ఎరువుల కర్మాగారం తనిఖీ

శింగనమల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు ఎరువుల కర్మాగారాలను అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని లోలూరు క్రాస్‌లోని భాస్కర్ ఫర్టిలైజర్, సి.బండమీదపల్లి స్వర్ణభూమి ఫర్టిలైజర్ ఎరువు కర్మాగారాలను తహసీల్దార్ శేషారెడ్డి, సీఎస్‌డీటీ చంద్రకళ, ఏఓ అన్వేష్‌కుమార్, పోలీసులు తనిఖీలు చేసి కర్మాగారంలో ఉండే యూరియా నిల్వల, ఎన్ని ఎరువులు తయారు చేస్తున్నారు, ఎక్కడికి సరాఫరా చేశారనే కోణంలో తనిఖీలు నిర్వహించారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అనంతపురంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ మల్లయ్య కాలనీలో గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంగళవారం గ్రామ పెద్దలు, సర్పంచు శివశంకర్, కాలనీ వాసుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పాండురంగస్వామి నిజపాద దర్శనం

అనంతపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం రామ్‌నగర్‌లోని పాండురంగస్వామి దేవాలయంలో స్వామి నిజపాద దర్శనం నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ సమేత పాండురంగస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేయడంతోపాటు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

'విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవు'



రికార్డులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ షారోన్ సోనియ

అనంతపురం వైద్యం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సమయపాలన విస్మరించి విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని మెడికల్ కళాశాల ఉద్యోగ, సిబ్బందికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియ హెచ్చరించారు. మంగళశారం వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, జాతీయ వైద్య మండలి సమన్వయకర్త శ్రీనివాస్‌లతో కలిసి కళాశాలలోని పలు విభాగాలను ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా టీచింగ్ ఫ్యాకల్టీ, పీజీ స్టూడెంట్స్, బోధనేతర ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించి మాట్లాడారు. విధుల సమయంలోనే కొంతమంది బయటకు వెళ్తున్నారన్నారు. మరికొంతమంది సెలవుపెట్టినా హాజరు పట్టికలో డాట్‌లను పెడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఉపేక్షించేదిలేదన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

జాతీయ రహదారిపై ఇరువర్గాల ఘర్షణ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వాహనాలను ఓవర్‌టేక్ చేసుకునే విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు గాయపడిన సంఘటన చెన్నేకొత్తపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కపట్నంకు చెందిన సుధీర్‌కుమార్ మరో నలుగురు స్నేహితులతో కలిసి రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ దర్శనానికి వెళ్లారు. తిరిగి కారులో బుక్కపట్నం వెళ్తున్నారు. దామాజుపల్లి సమీపంలోని జాతీయ రహదారి జంక్షన్ వద్దకు రాగానే హిందూపురానికి చెందిన చంద్రశేఖర్ మరో ఇద్దరు మిత్రులతో కలిసి అనంతపురం నుంచి కారులో హిందూపురంలో వెళ్తుండగా.. ఓవర్‌టేక్ చేయడంతో చూసుకుని వెళ్లమని చంద్రశేఖర్ తెలపడంతో వివాదం నెలకొంది. ఇరువురి వాహనాలు చెన్నేకొత్తపల్లి దాటి కోన క్రాస్‌కు వెళ్లగానే వాహనాలను ఆపుకుని మరోసారి వాగ్వావాదానికి దిగి ఘర్షణ పడ్డారు. ఘర్షణలో బుక్కపట్నంకు చెందిన సుదీర్‌కుమార్, సుబ్రమణ్యం, మహేశ్ బుచ్చయ్యగారిపల్లికి చెందిన నవీన్, జానకంపల్లికి చెందిన కిష్టకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. చంద్రశేఖర్ వర్గీయుల్లోకూడా ఒకరు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. ఇరివురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రాప్తాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23 నుంచి 25 వరకూ ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యుడు మల్లికార్జున పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం సీపీఐ రాష్ట్ర మహా సభల పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి రమేష్, మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

● శింగనమల: సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.చిన్నప్పయాద్ తెలిపారు. కార్యాలయంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుయాదవ్, బయన్న పాల్గొన్నారు.

'గుంతల రోడ్లను బాగుచేయాలి'

అనంతపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో గుంతల రోడ్లను బాగుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. నగరంలో రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తపోవనం రోడ్డులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. రెండోరోజు దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలమయ్యాయని, ప్రజల ఆరోగ్యంతో అధికారులు, పాలకులు చెలగాటమాడుతున్నారని విమర్శించారు. మున్సిపాలిటీ బడ్జెట్‌లో ఒక్క శాతం ఖర్చు ఈ బ్రిడ్జి కోసం కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. తపోవనం రోడ్డులో రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర వంకపై బ్రిడ్జి నిర్మించి, తపోవనం రోడ్డును బాగు చేయాలని, నడిమివంక సైడ్‌వాల్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాగా రిలే నిరాహార దీక్షలు సాగుతున్న సమయంలోనే తపోవనం నుంచి శాంతినగర్ వైపు వెళుతున్న ఓ ద్విచక్రవాహనదారుడు రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద అదుపుతప్పి వాహనంతోపాటు వంకలో పడ్డాడు. గమనించిన సీపీఎం కార్యకర్తలు వాహనదారుడిని రక్షించి, ద్విచక్ర వాహనాన్ని బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజుమోహన్, బాలు, వలి, శ్రీనివాసరావు, తిరుపాలు, శ్రీనివాసులు, రామిరెడ్డి, ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, రాజు, శీన, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై అధికారులు, నాయకులతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం వెంకటాపురం, రామగిరి పంచాయతీరాజ్ భవనంలో సమీక్షించారు. ఈ సమావేశంలో పలు సమస్యల గురించి చర్చించారు. గ్రామాలలో టీడీపీ అందిస్తున్న పథకాల గురించి మహిళలకు అందించిన ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలపై అమలుపై ప్రజలలో స్పందన ఏవిధంగా ఉందని ఆరాతీశారు. బెంగుళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య ఆస్పత్రి సిబ్బంది నియోజకవర్గంలో నిర్వహించనున్న హెల్త్‌క్యాంప్‌పై చర్చించారు. గ్రామాలలో సమస్యలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి లేకపోతే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. రామగిరిలోని పరిటాల రవి మెమోరియల్ అనంత అక్షరనిధి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పుస్తకాల వివరాలను గ్రంథాలయ అధికారి రమణతో అడిగి తెలుసుకున్నారు.

పింఛన్ తొలగించారని దివ్యాంగుల ఆవేదన



అర్జీ సిద్ధం చేస్తున్న దృశ్యం, పింఛన్ తొలగించారని వచ్చిన దివ్యాంగుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉన్నా పింఛన్ తొలగించారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పింఛన్ బాధితులు అనంత నగరపాలక సంస్థ పింఛన్ విభాగంలో అధికారులను కలిసి విన్నవించారు. మెడికల్ రీ వెరిఫికేషన్ తరువాత నగరపాలక సంస్థలో 1008 పింఛన్లను తొలగించారు. దీంతో దివ్యాంగులు తాము పూర్తి వికలత్వంతో ఉన్నామని, వెంటనే తమకు పింఛన్ సదుపాయం కల్పించాలని వేడుకున్నారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు ఏఎంసీలోకి కుటుంబ సభ్యుల సహాయంతో వచ్చారు. దివ్యాంగుల పరిస్థితిని చూసిన పలువురు అయ్యో పాపం అంటూ సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ డే



డాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ జిల్లా కార్యాలయంలో ఫొటోగ్రాఫర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమరా సృష్టికర్త చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోవిందు, నరసింహులు, సిద్ద పాల్గొన్నారు.

పాఠశాలకు నీటిశుద్ధి యంత్రం వితరణ



యంత్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నార్పల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గం గ్రామ సర్పంచ్ సాకే రామాంజనేయులు అతడి సోదరి సాకే మాధవి జ్ఞాపకార్థం మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలకు మంగళవారం నీటిశుద్ధి యంత్రాన్ని అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు క్రిష్ణయ్య, నారపరెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, సంజీవరాయుడు, ఇందిర, గ్రామస్థులు రామ్మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, కిరణ్‌కుమార్, మారెన్న, రాము, పెద్దక్క పాల్గొన్నారు.

24న మట్టి వినాయకుల పంపిణీ

అనంతపురం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస్‌నగర్ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో సిద్ధం చేసిన మట్టి వినాయక ప్రతిమలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఫణిమహేష్, అరవింద్, వంశీ, శ్రీవారి సేవకులు ప్రసాద్, అనీల్, ముఖేష్, నాగరాజు, సురేష్, ప్రకాష్ పాల్గొన్నారు.



స్వచ్ఛ రాయదుర్గం కోసం పనిచేద్దాం: విప్

రాయదుర్గం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా విధులు నిర్వహించాలని మున్సిపల్ కార్మికులకు విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలో అపరిశుభ్రతపై ఇటీవల పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయాన్నే ఆయన మున్సిపల్ పారిశుధ్య కార్మికులను కలిశారు. విధులను అందరూ సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేస్తే అధికారులకు, పాలకులకూ చెడ్డ పేరు వస్తుందని అన్నారు. రాయదుర్గంలో తగిన మంది కార్మికులు లేరని, దీంతో తమపై పనిభారం అధికమవుతోందని పలువురు కార్మికులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఈ విషయాన్ని పురపాలక శాఖమంత్రికి చెప్పి మరికొంతమందిని నియమించేలా కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు.


కార్మికులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

ఆర్థిక సాయం

కణేకల్లు : అన్నదాత సుఖీభవ పథకానికి సంఘీభావంగా స్థానికంగా మంగళవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. స్థానిక అనంత గ్రామీణ బ్యాంక్ వద్ద ఆ ర్యాలీని ఓ ట్రాక్టర్.. ద్విచక్రవాహనంలో వస్తున్న సురేష్‌ను ఢీకొంది. గాయపడిన అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విప్ కాలవ శ్రీనివాసులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి.. రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

న్యూస్ బాక్స్

నేడు పాలకవర్గం ప్రమాణస్వీకారం

గుత్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణంలో నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు. మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, చైర్మన్‌గా జక్కలచెరువుకు చెందిన గుర్రాల సూర్యప్రతాప్, వైస్ చైర్మన్‌గా పామిడికి చెందిన కొట్టం మాలిక్‌బాషాతో పాటు 20 మంది డైరక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తారు. భారీ ఎత్తున కూటమి శ్రేణులు తరలివస్తుండంతో అందుకు తగిన ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలో నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. లక్ష్యానికి మించి రాబడితో కళకళాడాల్సిన మార్కెట్ యార్డు... గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఉనికి కోల్పోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్కెట్ కమిటీలకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు చేపట్టిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'అన్నదాత సఖీభవ' దరఖాస్తుకు నేడే ఆఖరు

విడపనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సఖీభవ పథకం కింద నగదు జమ కాని రైతులు దరఖాస్తు చేసుకోవడానికి బుధవారమే ఆఖరని ఏఓహెచ్ పెన్నయ్య తెలిపారు. అలాగే పంటల బీమాకు దరఖాస్తు గడువు ఈ నెల 30తో ముగుస్తుందన్నారు. మండలంలోని డొనేకల్లు, కడదరబెంచి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంకి దశలో మొక్కజొన్న పంటకు ఎకరాకు 20 కేజీల యూరియాను వాడటం వల్ల 470 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు.

రిజర్వాయరులో 1.771 టీఎంసీల నీరు

బెళుగుప్ప, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో 1.771 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం 1,822 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,609 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, ఫేజ్-2కు 787 క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు వెల్లడించారు.

గుంతకల్లుకు మూడు కొత్త బార్లు

గుంతకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి కొత్తగా మూడు బార్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని గుంతకల్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్లను ఓపెన్ యాక్షన్ ద్వారా కాకుండా లాటరీ విధానంలో నిర్వహిస్తారన్నారు. లైసెన్సు ఫీజు సంవత్సరానికి రూ.55 లక్షలుగా నిర్ణయించారని, రూ. 5 లక్షల అప్లికేషన్ ఫీజు, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజు ఉంటుందని అన్నారు. అలాగే లైసెన్సు ఫీజును ఒకే దఫా కాకుండా, ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు. దరఖాస్తులను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని, 28వ తేదీ రాత్రి 8 గంటలకు డ్రా ఉంటుందని, లైసెన్సు పొందినవారు 15 రోజుల్లో బార్‌ను తెరవాల్సి ఉంటుందని అన్నారు.

● గుత్తి : గుత్తి మున్సిపాలిటీకి సంబంధించి ఒక మద్యం బార్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు. బార్ కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని, సంవత్సరానికి రూ.35 లక్షలు లైసెన్స్ ఫీజును ఆరు విడతలగా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఒక్కొక్క అప్లికేషన్‌కు రూ.5 లక్షలు నాన్ రీఫండబుల్ రుసుంతో పాటు ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కనీసం నాలుగు అప్లికేషన్లు రావాలని, ఈనెల 26 లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఊబిచెర్లలో కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న గ్రామస్థులు

గుత్తి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఊబిచెర్లలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ నెల 16 నుంచి త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలకరించి పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో భజనలు, మేళాతాళతో ఊరేగించారు.

'గర్భిణి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి'

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొన్ని రోజుల క్రితం గర్భిణి శ్రావణి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ తాలూకా కార్యదర్శి జీ గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రావణి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పట్టణ సీఐతో పాటు ఇతర అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు అధికారుల నిర్లక్ష్యం వల్లే తాను చనిపోతున్నానని శ్రావణి ఆడియో రికార్డు ఉన్నప్పటికీ పోలీసులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పట్టణ సీఐ యువరాజు ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిమ్మరాయుడు, ధనుంజయ, బుడేన్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం వర్తింపజేయండి


వినతి పత్రం ఇస్తున్న వెంకటరమణబాబు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, హిందూపురం, మడకశిర, కదిరి నియోజకవర్గాలకు చెందిన మహిళలకు స్త్రీశక్తి పథకాన్ని కర్ణాటక సరిహద్దు వరకు వర్తింపచేయాలని ఆప్ జిల్లా కన్వీనర్ వెంకటరమణబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందించారు.

పొంచి ఉన్న ప్రమాదం

కుందుర్పి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక పాఠశాలలు అపిలేపల్లి, యర్రగుంట పాఠశాల ఆవరణంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అపిలేపల్లి పాఠశాలలోని విద్యుత్ స్తంభం కొద్దిగా ఒరిగింది. అంతేకాకుండా స్తంభం కిందభాగాన దెబ్బతింది. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదం జరిగే ఆస్కారముంది. ట్రాన్స్‌కో అధికారులు ఆ విద్యుత్ స్తంభాలను మరో చోటికి మార్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.


అపిలేపల్లి పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభం

అధ్వానంగా రంగయ్యపాలెం రహదారి

శెట్టూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్యపాలెంకు వెళ్లే రహదారి మరీ అధ్వానంగా మారింది. ముప్పై సంవత్సరాలుగా ఈ గ్రామస్థులు ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు.. పాలకులు.. అధికారులు మారినా.. ఈ రోడ్డు మాత్రం బాగుపడలేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం బురద.. బురదగా మారిందన్నారు. పాలకులు స్పందించి.. ఈ రోడ్డును బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.


రంగయ్యపాలెం రహదారి

కూలిన వందేళ్ల వేప చెట్టు



గుంతకల్లుటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యాంసన్ పురం కాలనీలో వందేళ్ల వేప చెట్టు వేర్లతో సహా మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలింది. అనేక తరాల నుంచి ఉన్న చెట్టు కూలిపోవడంతో.. ఆ గ్రామస్థులు దాన్ని తిలకించి.. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నాలుగు మిద్దెలు ...

బెళుగుప్ప : కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆవులెన్నలో మూడు, బెళుగుప్పలో ఒక మిద్దె కూలినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో బాగా తడిసి తేమ కావడంతో మిద్దెలు కూలిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని అధికారులకు బాధితులను వినతిపత్రం అందజేశారు.

పాఠశాలకు డెస్కుల వితరణ

బ్రహ్మసముద్రం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు 46 డెస్కులను అందజేశారు. మంగళవారం వాటిని పాఠశాలకు లారీలో తరలించారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎన్టీఆర్ అభిమానులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న జూనియర్ ఎన్టీఆర్‌ను మరోసారి ఎవరైనా విమర్శిస్తే సహించేది లేదన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పామిడి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి (తగ్గుదేవాలయం), రంగసుభే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబ స్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో మంగళవారం అజ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాలలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్లకు అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేపట్టారు. విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. భక్తులు గీతాలాపన చేశారు. విఠోబ స్వామి ఆలయంలో దండి భజన చేస్తూ విఠోబస్వామి, రుక్మిణీదేవిల ఉత్సవ మూర్తులకు పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు.


అలంకరణలో విఠోబస్వామి

సీపీఐ మహాసభలకు తరలిరండి

కూడేరు, ఆగస్టు 19, (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం స్థానికంగా నియోజక వర్గ కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి నాగేంద్ర, నాయకులు మంగళవారం విడుదల చేశారు.

● గుంతకల్లుటౌన్ : సీపీఐ రాష్ట్ర 28వ మహాసభ పోస్టర్లను స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, స్థానిక నాయకులు ఆవిష్కరించారు.

● తాడిపత్రి: సీపీఐ రాష్ట్రస్థాయి మహాసభల పోస్టర్‌ను స్థానిక రంగప్పకాలనీలో ఏపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు నాగరంగయ్య, మద్దిలేటి, ఓబులేసు, ఎర్రప్ప ఆవిష్కరించారు.

● రాయదుర్గంరూరల్ : సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, రైతు సంఘం నాయకుడు తిప్పేస్వామి, నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో కోరారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

కూడేరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మీడియాతో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ .. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే.. వాటిని విస్మరించడం తగదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కరీం, మల్లికార్జున, రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి జైనబ్బీ దర్గా ఉరుసు

ఉరవకొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలను బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దర్గాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. గంధంతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం అల్లపరెడ్డి ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా మొదలై.. దర్గాకు చేరనుంది. గురువారం షంషేర్ ఊరేగింపు, శుక్రవారం అమ్మవారికి చాదర్‌ను ఊరేగింపు ఉంటుంది. అదేరోజు రాత్రి దర్గా ఆవరణలో కవాలి పోటీలతో ఉత్సవాలు ముగుస్తాయి.


జైనబ్బీ దర్గా

'పెద్దారెడ్డిలా నీచ రాజకీయాలు చేయలేం'

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లాగా.. మేం నీచ రాజకీయాలు చేయలేం. ఒకవేళ జేసీ ప్రభాకర్‌రెడ్డి అలా అనుకొని ఉంటే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయన స్వగ్రామమైన తిమ్మంపల్లిలో కూడా అడుగుపెట్టే వాడు కాదు. ఈపాటికి రెడ్డిపల్లి జైల్లోనో... కడప సబ్ జైల్లోనో ఉండేవాడు. ప్రజలు ఓటుతో ఆయనకు బుద్ధి చెప్పినా.. ఇంకా అహంకారం తగ్గలేదు. ఎమ్మెల్యేగా అనేక అక్రమాలకు పాల్పడి.. ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉంది.' అని కౌన్సిలర్ మల్లికార్జున ధ్వజమెత్తారు. స్థానిక నివాసంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీసులతో అనేక మందిపై తప్పుడు కేసులు పెట్టించిన పెద్దారెడ్డి.. నేడు పోలీసుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పెద్దారెడ్డి, ఆయన కుమారుల దమ్ము, ధైర్యం గురించి తాడిపత్రి, శింగనమల ప్రజలకు పూర్తిగా తెలుసన్నారు.

మొక్కల పరిశీలన

కంబదూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమాకుపల్లి, ఓబిగానిపల్లిలో బ్లాక్ అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కల పెంపకాన్ని డ్వామా పీడీ సలీంబాషా పరిశీలించారు. హార్టికల్చర్ బిల్లులు సక్రమంగా అందేలా చూడాలని లబ్ధిదారులు పీడీని కోరారు. ఆయన వెంట ఏపీఓ శ్రీదేవి, ఈసీ ఉస్మాన్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

యల్లనూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఏ రవి మంగళవారం తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులతో మాట్లాడామని, రెండు, మూడు రోజుల్లో యూరియా ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంటాయని ఇన్‌ఛార్జ్ వ్యవసాయాధికారి మధు తెలిపారు. స్టాక్ వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు.

యూనిట్ తనిఖీ

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో ఉన్న ఎంవీ గ్రీన్ పవర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. సబ్సిడీ యూరియాను అక్రమంగా ఈ యూనిట్ వినియోగిస్తున్నారా అనే అనుమానంతో ఈ తనిఖీ చేపట్టారు. అందులో సబ్సిడీ యూరియాను వినియోగించడంలేదని గుర్తించారు. ఆయన వెంట ఏడీఏ రవి, మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, వాసుప్రకాష్, శ్రీనివాసులు ఉన్నారు.

రేపు వాహనాల బహిరంగ వేలం

గుంతకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈనెల 21న వేలంవేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే వారు గురువారం ఉదయం ముందుగా రూ.3వేలు చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య మంగళవారం ఒక పేర్కొన్నారు. బోటనీ, ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు.

క్రైం న్యూస్..

కర్ణాటక వాసి ఆత్మహత్య

గుత్తిరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సండూరు మండలం దరోజీకి చెందిన సురేష్ (32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను వారం క్రితం జక్కలచెరువులోని బంధువుల ఇంటికి వచ్చాడు. గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్న అతను.. ఆ నొప్పి భరించలేక సోమవారం యాసిడ్ తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని బంధువులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక అతను మంగళవారం సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లికు చెందిన రంగనాథ్ (50) బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ఆ గ్రామంలో జూన్ 27న జరిగిన ఇరువర్గాల ఘర్షణలో అదే గ్రామానికి చెందిన కుళ్లాయప్ప, బాలయ్య, జగదీష్ దాడి చేయడంతో రంగనాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. కోలుకోలేక అతను మరణించాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. రంగనాథ్‌కు భార్య వరలక్ష్మి, ఐదుమంది పిల్లలు ఉన్నారు.

కొడవలితో దాడి

పెద్దవడుగూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి. వెంకటాంపల్లి గ్రామంలో సాలమ్మ, ఆమె కుమారుడు నరసింహులుపై మంగళవారం రాత్రి మురళీ కొడవలితో దాడిచేశాడు. సాలమ్మ కూతురు వరలక్ష్మిని అదే గ్రామానికి చెందిన మురళీకి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ సమస్యల కారణంగా వరలక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయమై ఘర్షణ జరగడంతో.. తన వెంట తెచ్చుకున్న కొడవలితో సాలమ్మ, నరసింహులుపై దాడి మురళీ దాడి చేశాడు. గాయపడ్డ వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కుందుర్పి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలయనూరు-బండ మీద పల్లి గ్రామాల మధ్య ఓ లారీ అదుపు తప్పి మంగళవారం బోల్తా పడింది. కర్ణాటక ప్రాంతమైన చెళ్లకెర నుంచి వక్క బస్తాల లోడుతో కాన్పూరుకు ఈ లారీ వెళ్తుండగా.. మలయనూరు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టమూ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


బోల్తా పడ్డ లారీ

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెల మృతి

బొమ్మనహాళ్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాల్ గ్రామ వాసి బి. సురేష్‌కు చెందిన నాలుగు గొర్రెలు విద్యుదాఘాతంతో మంగళవారం మరణించాయి. మేత కోసం గొర్రెలను ఎల్బీ నగర్ గ్రామం వద్ద రోడ్డు పక్కకు తొలుకొని వెళ్లారు. అక్కడి విద్యుత్ స్తంభానికి ఉన్న అర్త్ వైర్లకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో వాటిని తగిలిన నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మరణించాయి. అప్రమత్తమైన కాపరులు మిగతా గొర్రెలు అటువైపు వెళ్లకుండా కాపాడుకున్నారు. నాలుగు గొర్రెలు చనిపోవడంతో తనకు రూ. 60 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

చిరంజీవి పేరిట కసాపురంలో పూజలు


ప్రసాదం పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

గుంతకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజును పురష్కరించుకుని మంగళవారం ఉదయం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు, హోమం చేయించారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పూల రమణ, వక్కల ఉమ, భవాని రవికుమార్, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి, సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడు తలారి మస్తానప్ప, నాయకులు గుడిపాటి ఆంజనేయులు, ఫజులు, పత్తి హిమబిందు, వీరేశ్ కుమార్, రంజాన్, గోవిందు, కొలిమి రామాంజనేయులు, శ్రీదేవి పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

యాడికి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించి విక్రయాలు జరిగితే కఠిన చర్యలు చేపడతామని గుత్తి ఏడీఏ వెంకటరాముడు హెచ్చరించారు. మంగళవారం యాడికి, రాయలచెరువు గ్రామాల్లోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీచేశారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. యాడికిలోని శ్రీ వెంకట్ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువులను తనిఖీచేసి అనుమతులను లేని ఏషియన్ బయోటెక్ కంపెనీ నవారా ఎరువును సీజ్‌చేశారు. దీనివిలువ దాదాపు రూ.1.69 లక్షలు ఉంటుందన్నారు. మండలంలో ఫర్టిలైజర్స్ డీలర్ల దగ్గర కావాల్సినంత యూరియా ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏఓ మహబూబ్‌బాషా ఉన్నారు.